
# మేధావి

కోనే నాగ వెంకట ఆంజనేయులు



ఒక్కొక్కసారి ఎంతో మేధావులు కూడా చిన్న చిన్న విషయాల్లో పొరపాట్లు చేస్తూంటారట - ఎక్కడో చదివాను. నేను మేధావినో, కానో నాకు తెలియదు.

ఆదివారం పూట ఇంట్లోంచి బయటకు కదలడమంటే నాకు మా చెడ్డ చిరాకు. దొరికిన ఆ ఒక్క సెలవురోజూ ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవడం నాకిష్టం.

మా అత్తగారయితే "వారం అంతా ఆఫీసులో కొట్టుకుని, కొట్టుకుని ఉంటాడు కదా! ఆదివారం ఏ పనీ చెప్పకు వాడికి!" అంటుంది మా ఆవిడతో.

**మా** అత్తగారు నాకు మేనత్త కూడా కావడంతో - ఆ చనువూ, ఏకవచన ప్రయోగమూనూ.

శనివారం రాత్రే వార్నింగిచ్చేస్తాను మా ఆవిడకు - రేపు నన్నెక్కడికీ బయటకు పంపవద్దని.

ఆదివారం స్పెషల్ కూర మా అబ్బాయే తెచ్చేస్తాడు నాకే శ్రమా ఇవ్వకుండా.

ఆ ఆదివారం కూడా ఉదయమే నిద్రలేచిపోయి కాలకృత్యాలు, ఎక్సర్‌సైజులు, స్నానాలు కానిచ్చేసి ఎనిమిది గంటలయ్యేసరికి - ముందు వరండాలో పడక్కుర్చీలో వాలిపోయి, పుస్తకపఠనంలో మునిగిపోయాను ప్రతీ ఆదివారంలాగే.

మధ్యలో మా ఆవిడ అందించిన వేడి వేడి ఇడ్లీ కొబ్బరి చెట్నీతో లాగించి, కాఫీ అలవాటు లేదు కదా - గ్లాసెడు పాలు తాగి మళ్లీ పుస్తక పఠనంలో మునిగిపోయాను.

ఓ అరగంట గడిచి ఉంటుంది.

కాలింగ్ బెల్ మోగింది. కాసేపు వెయిట్ చేశాను - మా ఆవిడగానీ, పిల్లలుగానీ ఎవరైనా తలుపు తీయడానికి వస్తారేమోనని! ముగ్గురూ ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా ఉన్నట్లున్నారు - ఎవరూ రాలేదు.

ఇక తప్పదని పుస్తకం మూసేసి నేనే లేచి వెళ్లి తలుపు తెరిచాను.

ఎదురుగా ఎవరో కుర్రాడు చేతిలో ఏదో కాగితం ముక్క పట్టుకుని.

ఏమిటన్నట్టు చూశాను ఆ కుర్రాడివైపు.

"పేపర్ బిల్, సార్!" అన్నాడా కుర్రాడు.

పేపర్ బిల్లుతో మనకు సంబంధం లేదు.

"ఇదిగో, పేపరు బిల్లుట!" అన్నాను లోపలికి తొంగి చూస్తూ.

పేపరు బిల్లు, కరెంటు బిల్లు, పాల బిల్లు ఇలాంటివన్నీ మా ఆవిడే చూసుకుంటుంది. ఫస్టు తారీఖున జీతం తీసుకువచ్చి ఆవిడ చేతిలో పొయ్యడమే నావంతు.

ఆవిడ రాగానే నేను లోపలికి వెళ్లిపోయి మళ్లీ పుస్తకం చేతబూని అందులో మునిగిపోయాను.

మా ఆవిడ ఆ వ్యవహారం ముగించుకుని ఎప్పుడు లోపలికి వెళ్లిపోయిందో కూడా నేను గమనించలేదు.

మరో గంటన్నర గడిచింది. నేనింకా పుస్తకం చదువుతూనే ఉన్నాను. పుస్తక పఠనం నాకు ఎప్పుడూ విసుగు తెప్పించదు.

మావాడు వాడి గదిలో టేపురికార్డర్‌లో పాటలు వింటున్నాడు - వినబడుతున్నాయి.

బాత్‌రూమ్‌లోంచి బట్టలుతుకుతున్న చప్పుళ్లు వినిపిస్తున్నాయి.

మా అమ్మాయి స్కూలు యూనిఫాం ఉతుక్కుంటున్నట్లుంది.

మా ఆవిడ వంట గదిలోనే ఉంది. ఆదివారం స్పెషల్ వంటకాల వాసనలు ఘుమఘుమ లాడుతున్నాయి వంటింట్లోంచి.

మరో పత్రిక చేతిలోకి తీసుకుని దానిలో మునిగిపోయాను.

పావుగంట తరువాత కాలింగ్ బెల్ మోగింది. నేను అక్కడ ఉండగా ఎవరూ వచ్చి తలుపు తీసే ప్రయత్నం చెయ్యరని నాకు తెలిసిపోయింది.

విసుగ్గా లేచి తలుపు తెరిచాను. ఎదురుగా ఇంకో కుర్రాడు.

"పాత పేపర్లవాడిని, సార్!" అన్నాడు ఆ కుర్రాడు నా ముఖంలోని ప్రశ్నార్థకాన్ని




గమనించి.

"ఏమేవ్!

పాతపేపర్ల కుర్రాడు!" అనరిచాను.

"నా చెయ్యి ఖాళీ లేదుకానీ, మీరు చూడండి! హాల్లో టీపాయ్ కిందున్నాయి పేపర్లు. సరిగ్గా లెక్కపెట్టి ఇవ్వండి. పేపర్‌కి ముప్పై పైసలు. ఏం, వింటున్నారా?!" అన్నీ వంటగదిలోంచే.

"ఆఁ, వినపడిందిలే!" విసుగ్గా లేచి హాల్లో టీపాయ్ కింద ఉన్న పేపర్ల కట్ట తీసుకువచ్చి ఆ కుర్రాడి ముందు పడేశాను.

"సరిగ్గా లెక్కపెట్టుకో, బాబూ! పేపరుకి ముప్పై పైసలు. ఇష్టమైతేనే తీసుకో!" అన్నాను.

"అలాగేనండీ!" అని ఆ అబ్బాయి పేపర్లు లెక్కపెట్టడంలో మునిగిపోయాడు.

నేను మళ్లీ పుస్తకంలో మునిగిపోయాను.

"మొత్తం నూట తొమ్మిది పేపర్లండీ! పేపర్‌కి ముప్పై పైసలు చొప్పున - నూట తొమ్మిది పేపర్లకి ముప్పై రెండు రూపాయల డెబ్భై పైసలు!" అన్న పేపర్ కుర్రాడి మాటలతో ఈ లోకంలోకి వచ్చాను.

"అలాగా! ఉండు. ఏమేవ్!" అని మా ఆవిడ్ని పిలవబోయి, ఈ వ్యవహారం నన్నే చూడమన్నది కదా అని జ్ఞాపకం రావడంతో మిన్నకుండిపోయాను.

లోపలికి వెళ్లి పర్సులోంచి మూడు పది రూపాయల నోట్లు తీసుకువచ్చి ఆ కుర్రాడి చేతిలో పెట్టాను.

నోట్లు అందుకుంటూ ప్రశ్నార్థకంగా నావైపు చూస్తున్న ఆ కుర్రాడితో "రెండూ డెబ్భై పైసలు కొట్టేశానోయ్! చిల్లర లేదు మరి!" అన్నాను.

ఆ కుర్రాడు డబ్బులు జేబులో వేసుకుని పేపర్ల కట్ట పట్టుకుని వెళ్లిపోయాడు.

నేను మళ్లీ పుస్తకంలో మునిగిపోయాను.

పన్నెండున్నరకు పుస్తకం మూసేసి వంటింట్లోకి నడిచాను - ఆకలిగా అనిపించడంతో.

అప్పుడే వంట పూర్తిచేసిన మా ఆవిడ - "ఉండండి, స్నానం చేసి వచ్చి వేడిగా వడ్డించేస్తాను!" అంటూ బాత్‌రూమ్‌లోకి దూరింది.

ఉదయమే స్నానం చేసినా, వంట పూర్తయిన తర్వాత మళ్లీ స్నానం చెయ్యడం అలవాటు మా ఆవిడకు.

వంటగదిలోంచి తేలి వస్తున్న చికెన్ కర్రీ సువాసనలు నన్ను మళ్లీ పుస్తకం జోలికి వెళ్లనివ్వడంలేదు.

మా ఆవిడ స్నానం చేసి వచ్చి డైనింగ్ టేబుల్ సర్దుతోంది. నేనూ, మావాడూ, మా అమ్మాయి కుర్చీలు లాక్కుని డైనింగ్ టేబుల్‌ముందు కూర్చున్నాం.

"చికెన్ కర్రీ అద్భుతం!" అన్నాను - అన్నానికంటే ముందు వేడిగా ఉన్న చికెన్ ముక్క ఊదుకుంటూ లాగిస్తూ.

కబుర్లాడుకుంటూ భోజనాలు కానిస్తున్నాం.

హఠాత్తుగా అడిగింది మా ఆవిడ భోజనం మధ్యలో - "పేపర్లకి ఎంతొచ్చింది?" అని.

నాకు అర్థం కాలేదు. "పేపర్లకి ఎంత రావడమేమిటి?" అడిగాను.

"అదేనండీ, ఇందాక పాతపేపర్ల కుర్రాడొస్తే పేపర్‌కి ముప్పై పైసల చొప్పున తీసుకోమన్నాను కదా! అదే ఎంతొచ్చిందీ అని."

నా గొంతులో చికెన్ ముక్క పచ్చి వెలక్కాయలా తోచింది.

పాతపేపర్లు అమ్మితే డబ్బులు మనకే కదా వస్తాయి? మరి నేనే ఇచ్చేనేమిటి డబ్బులు ఆ పాతపేపర్ల కుర్రాడికి?

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు - నేను డబ్బులిస్తుంటే ఆ పేపర్లబ్బాయి నావైపు ఎందుకలా వింతగా చూశాడో.

బెదురుతూ జరిగినదంతా చెప్పాను - పొరపాటున ఆ కుర్రాడికి నేనే డబ్బులిచ్చేశానని.


"మీ తెలివి తెల్లారినట్లే ఉంది! ముప్పై, ముప్పై - అరవై రూపాయలు నష్టం ఈ ఆదివారంపూట మీ దయవలన!" నిట్టూరించింది మా ఆవిడ.

నాకేం వినబడనట్లు తల వంచుకుని తింటున్నాను నేను.

మా అమ్మాయి కూడా తల వంచుకునే తింటోంది కానీ, తింటూ తింటూ నవ్వాపుకోవడానికి కష్టపడుతోందని అర్థమయింది నాకు.

నేను మేధావినా?

■



## తొలిచూపులోనే ప్రేమా?

నమ్మండి, నమ్మకపొండి! 'బేతాల్ పచీసీ' టీ.వీ. సీరియల్‌లో బేతాళుడి పాత్ర ధరించిన షాబాజ్‌ఖాన్ తన విషయంలో జరిగిందదే నంటున్నాడు. ఆ సీరియల్ నడుస్తున్నప్పుడే అతను తన స్వప్నసుందరి, మాజీ మిస్ ఇండియా-కెనడా అందాలబొమ్మ గీతాబాలిని కలిశాడు. షూటింగు చూట్టానికి అతిథిగా వచ్చిన గీత ఈ ఖాన్ చూపుల వలలో నిలువునా పడిపోయి, ఆ ఇద్దరూ అమాంతంగా ప్రేమికులైపోయారు. "అవును, నిజం! మా తొలిచూపుల్లోనే ప్రేమ పుట్టింది" అంటున్నారిద్దరూ గట్టిగా, కచ్చితంగా!

ఆజానుబాహుడైన షాబాజ్‌ఖాన్ సినిమాలే కాక టీ.వీ. సీరియల్స్ కూడా ఒప్పుకుంటున్నాడు. 'చాందినీ' టీ.వీ. సీరియల్లో సంగీతాబిజ్లానీతో కలిసి చేశాడు (ఈమె ప్రస్తుతం ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు అజహరుద్దీన్ బీబీ). షాబాజ్ 'మేజర్ సాబ్, మెహందీ' చిత్రాలతో కలిపి దాదాపు 12 చిత్రాలు చేశాడింతవరకూ. ఓ అరడజను చిత్రాల్లో ముఖ్యపాత్రలు ధరిస్తున్నాడు. వాటిలో నితిన్ మన్మోహన్ చిత్రం 'చల్ మేరే భాయీ' వుంది. దాంట్లో సంజయ్‌దత్, సల్మాన్‌ఖాన్ కూడా వున్నారు. దర్శకుడు డేవిడ్‌ధవన్. "నాయక ప్రతినాయక పాత్రలన్నీ ధరిస్తున్నాను. కాని నటనకు అవకాశమున్న పాత్రలు రావాల్సివుంది" అంటున్నాడు షాబాజ్. అదృష్టం ఎలావుందో వేచిచూడండి ఖాన్ సాబ్!

ఎం.ఏ.